సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 30 । మే । 2025



విద్యుత్ ఉద్యోగుల నిరసన

యూపీలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 8లో



వస్తుందో.. రాదో..?

రాజీవ్ యువ వికాసం పథకం రుణం వస్తుందో, రాదోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, స్వామివారిని రాష్ట్ర మంత్రి సీతక్క దర్శించుకున్నారు. ఈఓ రమాదేవి స్వాగతం పలకగా పండితులు వేదాశీర్వచం అందించారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.23.42 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. 80 రోజులకు గాను రూ.23,42,780తో పాటు రెండు విదేశీ కరెన్సీ లభించాయని, మిశ్రమ బంగారం, వెండి కూడా లభ్యమయ్యాయని ఈఓ రజినీకుమారి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి జి.సుదర్శన్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారికి సువర్ణ పుష్పార్చన..

శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు జిల్లా అధికారి



సదస్సులో మాట్లాడుతున్న మధువరణ్

కొత్తగూడెంఅర్బన్: ఢిల్లీలో యూనిసెఫ్ సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వి.మధువరణ్ హాజరయ్యారు. మానవ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాలు, దేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యయనాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై సదస్సు జరుగనుండగా దేశంలోని పలువురు ప్రముఖులు, వైద్యారోగ్య శాఖ నిపుణులు అవగాహన కల్పించారు. జిల్లా నుంచి హాజరైన మధువరణ్ కూడా పలు సూచనలు చేశారు.



ఇల్లెందులో నిరుపయోగంగా ఉన్న వైటీసీ భవనం

తుప్పు పడుతున్న శిక్షణ !

ఐటీడీఏ ఆధ్వర్యంలో వైటీసీల ఏర్పాటు

- కేంద్రాల నిర్వహణపై కొరవడిన పర్యవేక్షణ
- భూత్‌బంగ్లాను తలపిస్తున్న ఇల్లెందు సెంటర్
- ఇలాగైతే యువతలో నైపుణ్యం పెంచేది ఎలా..?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'మన విద్యార్థుల దగ్గర పేరుకే సర్టిఫికెట్లు ఉంటున్నాయి కానీ జాబ్ మార్కెట్‌కు తగ్గ స్కిల్స్ ఉండడం లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. అచ్చంగా అదే పరిస్థితి జిల్లాలోనూ నెలకొంది. గిరిజన యువత కోసం స్కిల్ ట్రైనింగ్ సెంటర్లు ఉన్నా అక్కడ శిక్షణే ఇవ్వడం లేదు.

దశాబ్దాల క్రితమే వైటీసీలు..

రాష్ట్రంలో ఇంజనీరింగ్ డిగ్రీలు సాధించిన విద్యార్థుల వద్ద కూడా జాబ్ ఓరియెంటెడ్ స్కిల్స్ కొరవడ్డాయని సాక్షాత్తూ ముఖ్యమంత్రే ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న యువతతో పాటు రాబోయే తరానికి కూడా ఇప్పటి జాబ్ మార్కెట్‌కు తగ్గట్టుగా నైపుణ్యం ఉండేందుకు వీలుగా ఏకంగా స్కిల్ యూనివర్సిటీనే ప్రకటించారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్కిల్స్‌కు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. అయితే రేవంత్‌రెడ్డి సర్కార్ కంటే దశాబ్దాలకు ముందే గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు నైపుణ్య శిక్షణపై దృష్టి సారించాయి. ఈ మేరకు ప్రతీ ఐటీడీఏ పరిధిలో ప్రత్యేకంగా యూత్ ట్రైనింగ్ సెంటర్లను (వైటీసీ) నిర్మించారు. భద్రాచలంలోని వైటీసీ రాష్ట్ర విభజనతో ఏపీలోకి వెళ్లడంతో ఇల్లెందులో కొత్తగా మరొకటి నిర్మించారు. ఆ తర్వాత భద్రాచలం ఐటీడీఏ క్యాంపస్‌లో మరో వైటీసీని అందుబాటులోకి తెచ్చారు. శిక్షణ కోసం వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే విద్యార్థులు/ఉద్యోగార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించారు. అయితే ఆరంభంలో జోరుగా సాగిన శిక్షణ కార్యక్రమాలు ఆ తర్వాత మందగించాయి. ఒకప్పుడు వెంటవెంటనే జరిగిన జాబ్‌మేళాలు ఇప్పుడు కనుమరుగయ్యాయి.



తలుపులు లేని తరగతి గదులు

ఊడిపోయిన తలుపులు..

ఇల్లెందు వైటీసీలో పది డార్మిటరీలు, నాలుగు గెస్ట్‌రూమ్‌లు, నాలుగు తరగతి గదులు, ఫ్యాకల్టీ రూమ్‌లు 2, కాన్ఫరెన్స్‌హాల్ 1, డైనింగ్‌హాల్ 1, ట్రేడ్‌ల్యాబ్స్ 3, కంప్యూటర్ ల్యాబ్ 1, మీటింగ్ హాల్ 1తో పాటు ఆఫీస్ రూమ్‌ను అన్ని హంగులతో నిర్మించారు. రూ.3.80 కోట్ల వ్యయంతో 2014లో పనులు ప్రారంభించగా 2015లో అందుబాటులోకి తెచ్చారు. అయితే గత కొంత కాలంగా ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు లేకపోవడంతో ఇటు విద్యార్థులు, అటు ఫ్యాకల్టీ ఎవరూ రావడం లేదు. వాచ్‌మన్ ఒక్కరే ఉంటున్నారు. భవనం ఆలనాపాలన లేకపోవడంతో ఇప్పటికే తలుపులన్నీ పుచ్చిపోయాయి. గదులు బూజు పట్టాయి. మంచాలు తప్పుపట్టి పోతున్నాయి. వాష్‌రూమ్‌లు వాడుకోవడానికి వీల్లేకుండా తయారై గబ్బిలాలకు ఆవాసంగా మారాయి.

పట్టించుకునే నాథులేరి ?

హైదరాబాద్ – కొత్తగూడెం జాతీయ రహదారి పక్కనే ఇల్లెందు డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్న వైటీసీ ఎప్పుడూ తాళం వేసే ఉంటోంది. సకల సకర్యాలున్న భవనం ఇలా పడావు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. జిల్లా స్థాయి అధికారులు ఒక సారి ఈ వైటీసీని సందర్శిస్తే గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయో తెలుస్తుంది. ఎంత మంచి పని ముట్టయినా ఉపయోగించకుంటే తుప్పు పట్టినట్టు సకల సౌకర్యాలున్న వైటీసీలు శిక్షణ లేక దుమ్ము కొట్టుకుపోతున్నాయి.



వృథాగా పడి ఉన్న బెడ్స్

ఆదివాసీల అంతానికి కేంద్రం కుట్ర

- అటవీ సంపదను సంపన్నులకు దోచిపెట్టే ప్రయత్నం
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ బలరామ్‌నాయక్, ఎమ్మెల్యేలు

పాల్వంచరూరల్ : ఆదివాసీ జాతిని అంతం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆదివాసీ సమ్మేళనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మణిపూర్, అస్సాం, నాగాలాండ్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం పలు ఆపరేషన్‌ల పేరుతో దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. రాజ్యాంగంలోని ఐదు, ఆరు చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో పరిశ్రములు ఏర్పాటు చేయాలంటే స్థానిక గిరిజనులతో గ్రామ సభలు నిర్వహించి ఆమోదించాక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, కానీ అలాంటిది ఏమీ లేకుండానే మోదీ ప్రభుత్వం ఖరీదైన అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, ఎదురు తిరిగిన వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అడ్డు తొలగిస్తోందని ఆరోపించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న ఢిల్లీలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీడీఏలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నాడు రద్దు చేసిన జీఓలను తిరిగి తమ ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని, ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకొస్తామని వివరించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి..

రాజ్యాంగ పరిరక్షణకు ఆదివాసీలు ఉద్యమించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరామ్ నాయక్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. గిరిజన చట్టాలు, హక్కులపై అందరికీ అవగాహన ఉండాలని, ఇలాంటి శిక్షణ తరగతుల్లో వాటి గురించి తెలుసుకోవాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సక్రమంగా అమలు చేయకుండా బీజేపీ సొంత ఎజెండా అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఉద్యమం చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌తోనే దేశంలో సామాన్యుడికి న్యాయం జరుగుతుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. గిరిజన హక్కుల సాధనకు ఉద్యమం చేస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చెప్పారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ బాబురావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ప్రోగ్రామ్ కన్వీనర్ రాహుల్ బాల్, నాయకులు ఎడవల్లి కృష్ణ, నాగ సీతారాములు, సుగుణ, కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులకు శంకుస్థాపన..

చుంచుపల్లి : పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి వరకు రూ. 6.50 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి మంత్రి సీతక్క గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్ల ఏర్పాటుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతీ మారుమూల గ్రామానికి రోడ్లను అనుసంధానం చేస్తామని చెప్పారు. అంతకుముందు ఐసీడీఎస్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించి వేస్ట్ నుండి బెస్ట్‌ను రూపొందించిన కళాకృతులను చూసి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా తదితరులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాలయంలో 1, 2, 5వ తరగతుల్లో మిగిలిన బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి పినపాక మినీ గురుకులంలో ఒకటో తరగతిలో 30, రెండో తరగతిలో ఒకటి, ఐదో తరగతిలో 8 సీట్ల భర్తీకి అర్హత కలిగిన స్థానిక గిరిజన విద్యార్థినులు ఈనెల 30 నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక విద్యార్థులు లేకుంటే సమీప మండలాల వారికి అవకాశం ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డ్ తదితర పత్రాలు జత చేయాలని, లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారని తెలిపారు. వివరాలకు 97014 95907, 77026 52708 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పర్ణశాలకు కేంద్ర బృందం సభ్యులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కేంద్ర బృందం సభ్యులు రాకేష్‌కుమార్, వివేక్ కుమార్ గురువారం దర్శించుకున్నారు. ముందుగా అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి ప్రాశస్త్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఏపీఓ సుకన్య, రాజ్‌సింహ తదితరులు ఉన్నారు.

జీసీసీ గోడౌన్ తనిఖీ



గోదాంను పరిశీలిస్తున్న తిరుపతి

పాల్వంచరూరల్ : స్థానిక గిరిజన సహకార సంస్థ గోదాంను జీసీసీ చైర్మన్ తిరుపతి గురువారం తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న సరుకులను తనిఖీ చేశాక ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీసీసీని లాభాల బాటలో పయనింపజేయాలని సూచించారు. సమావేశంలో జీసీసీ డీఎం సమ్మయ్య, బ్రాంచి మేనేజర్లు లక్ష్మీజీ, జయరాజ్, నర్సింహారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజన సహకార సంస్థ ఉద్యోగులు చైర్మన్‌కు వినతిపత్రం అందించారు.

మున్సిపాలిటీ ఇక కనుమరుగు!

కొత్తగూడెం కార్పొరేషన్‌లో పాల్వంచ విలీనం



పాల్వంచ మున్సిపల్ కార్యాలయం

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ మున్సిపాలిటీ ఇక కనుమరుగై కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం అయింది. దీంతో డివిజన్ ఆఫీస్‌గా మాత్రమే మనుగడ కొనసాగనుంది. ఇకపై పరిపాలనా వ్యవహారాలన్నీ కొత్తగూడెం కార్పొరేషన్‌లోనే నడవనున్నాయి. కార్పొరేషన్ అయితే గణనీయంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా.. పన్నుల భారం కూడా అధికంగానే ఉంటుందని స్థానికులు అంటున్నారు. 1987లో ఏర్పడిన పాల్వంచ మున్సిపాలిటీ 38 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు పలికింది. కొత్తగూడెం కార్పొరేషన్ జీఓ గురువారం విడుదలైంది. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లోని పలు గ్రామాలు సైతం ఈ కార్పొరేషన్‌లో విలీనం కానున్నాయి.

అధికారుల పాలనలోనే..

ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా, పారిశ్రామిక పట్టణంగా ఉన్న పాల్వంచలో 24 వార్డులు, 44 స్లమ్ ఏరియాలు ఉండగా సుమారు లక్ష మంది జనాభా ఉన్నారు. 1987 ఫిబ్రవరిలో పాల్వంచ గ్రామ పంచాయతీని తృతీయ శ్రేణి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అదే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించారు. 1992 వరకు పాలకవర్గం కొనసాగింది. తర్వాత మూడేళ్ల పాటు ఎన్నికలు జరగలేదు. తిరిగి 1995లో ఎన్నికైన పాలకవర్గం 2000 సంవత్సరం వరకు కొనసాగింది. ఇక ఆ తర్వాత ఎన్నికల ఊసే లేదు. ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా ఇది ఏజెన్సీనా, నాన్ ఏజెన్సీనా అనే వాదనలు ఎప్పటికప్పుడు చర్చనీయాంశంగా మారుతూ ఆ ప్రభావం ఎన్నికలపై పడుతూ వచ్చింది. దీంతో గత 25 ఏళ్లుగా అధికారుల పాలనే కొనసాగుతోంది.

తరలిపోయిన అనేక కార్యాలయాలు..

గతంలో ఐటీడీఏ పాల్వంచలో ఉండేది. ఆ తర్వాత భద్రాచలానికి వెళ్లింది. దాంతో పాటు ట్రైబల్ కోర్టు కూడా తరలిపోయింది. ఇక ఆర్డీఓ కార్యాలయాన్ని కొత్తగూడెం డివిజన్‌కు మార్చేశారు. పలు ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలు సైతం ఇక్కడి నుంచి తరలిపోయాయి. డివిజన్ కేంద్రంగా ఉన్న సమయంలో ఇక్కడికి అనేక మండలాల ప్రజలు పనుల నిమిత్తం వచ్చేవారు. వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయం, ఇరిగేషన్ ఈఈ కార్యాలయం, ఏటీడబ్ల్యూఓ కార్యాలయాలు సైతం తరలిపోయాయి. పారిశ్రామిక కేంద్రానికి ఆయువుపట్టుగా ఉన్న కేటీపీఎస్‌లో ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్) తొలగింపుతో వేలాది మంది కార్మికులు బదిలీపై వెళ్లిపోయారు. ఎన్ఎండీసీ విస్తరణకు నోచుకోక మూతబడింది. నవ కంపెనీ విద్యుత్ కేంద్రంలోనూ ఉత్పత్తి నిలిపివేశారు.

కార్పొరేషన్ కమిషనర్‌గా సుజాత



కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సుజాతను నియమిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్‌లో విలీనమైన సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామాలు, పాల్వంచ మున్సిపల్ ఆస్తులను కార్పొరేషన్‌కు బదలాయించాలని, అందుకు పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు.

పకడ్బందీగా ప్రాధాన్యతా పథకాలు

- 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక
- ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు మంజూరైనా బాధ్యులపై చర్యలు
- ఎరువులు, విత్తనాల కొరత రాకుండా ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, పొంగులేటి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి పాటిల్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ, సాగు ప్రణాళికలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తొలుత ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్ జిల్లాల వారీగా పథకాలు అమలు నివేదికలు వెల్లడించారు.

నకిలీలు అమ్మితే కఠిన చర్యలు

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలోకి నకిలీలు రాకుండా ఏపీ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా, రైతులకు చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అలాగే, భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఆయన జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ నిర్వహణపై సూచనలు చేశారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలను తొలి దశలో అరికట్టడమే కాకుండా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను తనిఖీ చేయాలని, జాబితాలో అర్హుల పేర్లే ఉండేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఆశాజనకంగానే ఉన్నా మరింత పెరగాలని సూచించారు. ఇక రుతుపవనాలు ముందుగా వచ్చినందున సరిపడా ఎరువులు, విత్తనాలు సమకూర్చాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. నిల్వలను తరచుగా పరిశీలిస్తూ ఎక్కడా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చూడాలని సూచించారు. రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హులు ఉన్నట్లు తేలితే బాధ్యులైన గెజిటెడ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసైన్డ్ భూముల్లో పొజిషన్‌లో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నందున ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అలాగే, సాదా బైనామా దరఖాస్తుల్లో ప్రభుత్వ భూములు ఉంటే తిరస్కరించాలని తెలిపారు. జూన్ 10 లోపు పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే కాక లబ్ధిదారులకు అవసరమైన ఇసుక టోకెన్ల ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని తెలిపారు. అంతేకాక సగంలో మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా పూర్తిచేయించాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు వైద్యులు, సిబ్బందిని పెంచాలని కోరారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సిఫారసులు పరిగణనలోకి తీసుకోకుండా చూడాలన్నారు. సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, ఖమ్మం సీపీ సునీల్ దత్, ఎస్పీ బి.రోహిత్ రాజ్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్లు పి.శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిష్టారం ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా శ్రీనివాస్



జీఎం చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా కసనబోయిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులను గురువారం జీఎం శాలేం రాజు అందించారు. సింగరేణి గతేడాది ఇంటర్నల్ నోటిఫికేషన్ ద్వారా మేనేజ్‌మెంట్ ట్రెయినీ(వెల్ఫేర్ ఆఫీసర్)లుగా పలువురిని ఎంపిక చేయగా కొందరికే పోస్టింగ్ ఇచ్చింది. మిగతా వారు హైకోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి. దీంతో ఐదుగురికి పదోన్నతి కల్పించగా అందులో శ్రీనివాస్ ఉన్నారు. అలాగే, కె.కల్యాణ్ రాజ్‌కుమార్‌ను ఆర్జీఓసీ-2కు, ఏ.మధును అడ్రియాలకు, సిరిమల్లె అశోక్‌ను ఇల్లెందు కేఓసీకి, దాసరి నాగరాజును జీడీకే 2, 2ఏకు కేటాయించారు.

కార్పొరేట్ సివిల్ హెచ్‌ఓడీగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో సివిల్ హెచ్‌ఓడీగా ధనసరి వెంకటేశ్వర్లును నియమిస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న టి. సూర్యనారాయణ ఈ నెల 31 ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో మణుగూరు సివిల్ ఏజీఎం వెంకటేశ్వర్లును నియమించారు.

ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ నరేందర్

కొత్తగూడెం అర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్)గా గోపతి నరేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పని చేస్తున్న ఆయన జిల్లాకు పదోన్నతిపై అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన నరేందర్‌ను పలువురు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

గురుకులంలో డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండారుపల్లి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీకామ్, బీఏ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఐటీ హబ్‌లో 2నుంచి నైపుణ్య శిక్షణ

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని ఐటీ హబ్‌లో వచ్చే నెల 2వ తేదీ నుంచి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యాన నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు. జావా ఫండమెంటల్, జావా ప్రోగ్రామింగ్, పైథాన్ డేటాబేస్, క్లౌడ్ కంప్యూటింగ్, టాలీ జీఎస్టీ, ఐటీ స్కిల్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇందుకోసం రూ.599 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే ఆరు నెలల వ్యవధిలో అభ్యర్థులకు అనుకూలమైన సమయంలో శిక్షణకు హాజరుకావొచ్చని వెల్లడించారు. పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 95025 05880 నంబర్‌లో సంప్రదించాలని వారు ఓ ప్రకటనలో సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుడు ఆశీర్వాదం మృతి

తల్లాడ: తల్లాడ మండలం పినపాకకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మోదుగు ఆశీర్వాదం (69) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. యాభై ఏళ్ల క్రితం కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. కొన్నాళ్లు కాంగ్రెస్‌లో కొనసాగగా, 2001లో టీఆర్‌ఎస్‌లో చేరి మలిదశ ఉద్యమంలో చురుగ్గా వ్యవహరించారు. బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గానూ పనిచేసిన ఆశీర్వాదం తల్లాడలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా, ఆశీర్వాదం మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. అలాగే, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్‌తో పాటు వజ్రాల రామిరెడ్డి, కోడూరి వీరకృష్ణ, బద్దం కోటిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కాంపాటి జమలయ్య, జీవీఆర్, వివిధ పార్టీల నాయకులు సైతం నివాళులర్పించి ఆశీర్వాదం కుటుంబీకులను పరామర్శించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

వస్తుందో.. రాదో..?

రాజీవ్ యువ వికాసంపై గందరగోళం

- సిబిల్ స్కోర్ నిబంధనతో దరఖాస్తుదారుల ఆందోళన
- మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న పథకం



కొత్తగూడెంఅర్బన్: రాజీవ్ యువ వికాసం పథకం రుణం వస్తుందో? రాదోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలువురు యువతీ యువకులు ఆయా మున్సిపాలిటీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పరిశీలించి అన్ని ధ్రువపత్రాలు ఉన్న దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. బ్యాంకర్లు దరఖాస్తుదారుడి సిబిల్ స్కోర్, గతంలో ఉన్న బ్యాంకు రుణాలు, చెల్లింపులు, చెక్‌బౌన్స్, ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న రుణానికి మళ్లీ నగదు చెల్లించగలడా? అనే విషయాలు పరిశీలించి అర్హుల జాబితాలను మండల, పట్టణ అధికారులతోపాటు ఎంపిక కమిటీలకు పంపిస్తారని తెలుస్తోంది. ఆ తర్వాత అధికారులు, కమిటీ సభ్యులు ఇంటర్వ్యూ నిర్వహించి, కులాల వారీగా ఆయా కార్పొరేషన్లకు పంపించనున్నారు. అనంతరం ప్రభుత్వ సైట్‌లో అప్‌లోడ్ చేసి సబ్సిడీ కోసం పంపించాల్సి ఉంటుంది.

సబ్సిడీ ఇలా..

రాజీవ్ యువ వికాసం పథకం జూన్ 2 నుంచి ప్రారంభం కానుంది. అర్హులైన దరఖాస్తుదారులకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందులో రూ.50 వేలు రుణం తీసుకున్న వారు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు తీసుకున్న వారికి 80 శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు రుణం ఇస్తారు. రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు తీసుకుంటే 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం ఇస్తారు. గతంలో దరఖాస్తుదారుడు బ్యాంకు రుణం తిరిగి చెల్లిస్తాడో లేదోననే అనుమానంతో సబ్సిడీ పోగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకర్లు ముందే డిపాజిట్ చేయించుకునేవారు. ఇప్పుడు సిబిల్ స్కోర్, ఇతర పరిశీలన అంతా బ్యాంకర్లకు అప్పగించడం సరికాదని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

రాజకీయ పార్టీల నుంచి మరో జాబితా...

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి పట్టణ, మండలాధికారులు, కమిటీలు తర్జనభర్జనలు పడుతూ దరఖాస్తుల పరిశీలన చేసి బ్యాంకులకు పంపిస్తుంటే, కొందరు దరఖాస్తుదారులు రాజకీయ పార్టీ నాయకులను ఆశ్రయిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వేర్వేరుగా దరఖాస్తుదారుల నుంచి ఒక జిరాక్స్ సెట్ సేకరిస్తున్నారు. ప్రస్తుతం రాజీవ్‌యువ వికాసం దరఖాస్తులు అన్నీ కూడా బ్యాంకులకు చేరాయి. వాటిలో అర్హత కలిగిన వారి జాబితాను ప్రభుత్వం తిరిగి బ్యాంకులకు పంపిస్తుందని బ్యాంకర్లు చెబుతున్నారు. కార్పొరేషన్ అధికారులు మాత్రం బ్యాంకు నుంచి బయటకు వచ్చిన జాబితాలోని వారికి పట్టణ, మండల కమిటీలు ఇంటర్వ్యూలు చేపట్టి అర్హులను ఎంపిక చేస్తారని చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారులు గందరగోళంలో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ కార్పొరేషన్‌కు 9747, బీసీ కార్పొరేషన్‌కు 20602, మైనారిటీ కార్పొరేషన్‌కు 9800 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సిబిల్‌తో సంబంధం లేకుండా..



రాజీవ్ యువ వికాసానికి సంబంధించి కొత్త నిబంధనలు రద్దు చేయాలి. సిబిల్ స్కోర్ పరిగణనలోకి తీసుకోకుండా రుణం మంజూరు చేయాలి. సబ్సిడీ పోను 20, 30 శాతం వాటాను బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు దరఖాస్తుదారులు సిద్ధంగా ఉన్నారు.

-హరి, కొత్తగూడెం

గడువుకు ముందే పని చేయలే..



రాజీవ్ యువ వికాసం సైట్ కేటాయించిన గడువుకు వారం ముందు నుంచే పని చేయలేదు. దీని వలన దరఖాస్తు చేసుకోలేకపోయాను. ప్రభుత్వం మళ్లీ దరఖాస్తులకు వెసులుబాటు కల్పించాలి. అర్హులందరికీ రుణం అందించాలి.

-శ్రీనివాస్, కొత్తగూడెం

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పనిచేస్తున్నాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

దమ్మపేట: విశ్వవిఖ్యాత నటుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్ఫూర్తితో పనిచేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేటలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. నాడు ఎన్టీఆర్ చేతుల మీదుగా తయారైన నాయకులే నేడు పలు పార్టీల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఒక్క తెలంగాణలోనే కాక దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానిస్తే తాను వెళ్తానని స్పష్టం చేశారు. సొంత పార్టీ వ్యక్తులు, బయట పార్టీ వ్యక్తులు ఎన్ని ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించినా తాను ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తున్నానని చెప్పుకొచ్చారు. సీతారామ ప్రాజెక్టు జలాలను ప్రస్తుత సంవత్సరం సత్తుపల్లి నియోజకవర్గానికి, రాబోయే సంవత్సరం నాటికి అశ్వారావుపేట నియోజకవర్గానికి తీసుకొస్తానని వివరించారు. పెదవాగు, వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. అంతకుముందు మండలంలోని గండుగులపల్లిలో తన పామాయిల్ క్షేత్రంలో ఫార్మ్ రోబో సంస్థ రూపొందించి కలుపు తీసే యంత్రాన్ని పరిశీలించారు. ఆయిల్ ఫెడ్ అనుబంధ శాస్త్రవేత్త కిరణ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర, వలీపాషా, అలపాటి ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, రావు గంగాధరరావు, పైడి వెంకటేశ్వరరావు, దారా మల్లికార్జునరావు, పగడాల రాంబాబు, కొండపల్లి కృష్ణమూర్తి, కే.వి.సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, నల్లగుళ్ల కిరణ్, గడ్డిపాటి సత్యం పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



కేటీపీఎస్ ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

పాల్వంచ/మణుగూరు రూరల్: ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్(టీజీపీఈ) జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గురువారం పాల్వంచ కేటీపీఎస్, మణుగూరులోని బీటీపీఎస్‌ల ఎదుట భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న నాయకులపై కేసులు బనాయిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని, ఉత్తర ప్రదేశ్ కార్మికులకు అందరూ అండగా నిలవాలని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ అసిస్టెంట్ ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులు రవిప్రసాద్, రవితేజ, వివిధ కార్మిక సంఘాల నాయకులు బ్రహ్మాజీ, యాస్మీన్, రాజేందర్, రాధాకృష్ణ, వెంపటి వెంకటేశ్వర్లు, నరసింహారావు, సాయిరాం, వి.ప్రసాద్, బి.కృష్ణ, వెంకట్రామ్, వీరస్వామి, ఆర్.రామచందర్, సిద్దెల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే అంబాసిడర్లు..

మహిళా మార్ట్‌ను సందర్శించిన ఉమ్మడి జిల్లా అధికారులు



మార్ట్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, డీఎఫ్‌ఓ



క్యాంటీన్ వద్ద టీ తాగుతున్న కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, డీఎఫ్‌ఓ

ఖమ్మంమయూరిసెంటర్: 'మా వంతుగా మార్ట్ ఏర్పాటు చేసి ప్రచారం కల్పిస్తున్నాం.. మీరు తయారు చేసిన ఉత్పత్తులకు మీరే అంబాసిడర్లుగా విక్రయించుకోవడం, లాభాలు వచ్చేలా ముందుకు సాగే బాధ్యత మీదే' అని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. ఖమ్మం వైరా రోడ్డులో ఏర్పాటుచేసిన మహిళా మార్ట్‌ను భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఖమ్మం సీపీ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్, ఖమ్మం జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ గురువారం సందర్శించారు. మార్ట్ ఏర్పాటుకు దారి తీసిన అంశాలను కలెక్టర్ వారికి వివరించాక మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన వస్తువులను అధికారులు ఆసక్తిగా పరిశీలించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా అధికారులు మార్ట్‌లో పలు వస్తువులు కొనుగోలు చేశారు.

టీ బాగుంది.. నేనే పే చేస్తా..

మార్ట్‌ను సందర్శించాక ఆవరణలో ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను వద్దకు అధికారులంతా వచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మం సీపీ సునీల్‌దత్ అందరినీ టీ తాగాలని కోరారు. ఆపై టీ బాగుందని నిర్వాహకురాలిని అభినందించిన ఆయన తన ఫోన్‌లో యాప్ ద్వారా డబ్బు చెల్లించారు.

2న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికకు జూన్ 2న పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకల్లా రిపోర్టు చేయాలని సూచించారు.

ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే..



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఏర్పడితే నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తే 11ఏళ్లుగా నిరాశే మిగిలిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి మనోహర్‌రాజు పేర్కొన్నారు. యూనియన్ 12వ ఆవిర్భావ వేడుకలను ఖమ్మంలోని కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించిన మనోహర్‌రాజు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యాన ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీ.నాగేశ్వరరావు, వెంగళరావు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డితో పాటు విజయ్, పద్మ, ముత్తయ్య, వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, ఉమాదేవి, రాము పాల్గొన్నారు.

నేల చదును పనులు అడ్డగింత

సింగరేణి అధికారులతో నిర్వాసితుల వాగ్వాదం



దోజర్ యంత్రం ముందు నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ఇల్లెందురూరల్: మండలంలోని విజయలక్ష్మినగర్ శివారులో వ్యవసాయ భూమిలో సింగరేణి చేపట్టిన నేల చదును పనులను స్థానిక గిరిజనులు గురువారం అడ్డుకున్నారు. జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంగా గుర్తించిన తమ వ్యవసాయ భూమికి పరిహారంపై స్పష్టత ఇవ్వకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని అధికారులను నిలదీశారు. యంత్రాలకు అడ్డుగా కూర్చొని నిరసన తెలపడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సర్వే నంబర్ 588/2 పరిధిలోని 7.03 ఎకరాల్లో సింగరేణి, అటవీ, రెవెన్యూ అధికారులు సర్వే చేశారని, పరిహారం చెల్లిస్తామని ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభలో అప్పటి ఆర్డీఓ స్వర్ణలత ప్రకటించారని గుర్తుచేశారు. కానీ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తేజావత్ లాలు, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు, వడ్ల శ్రీను, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

తిరుమలాయపాలెం: అనుమతి లేకుండా రవాణా చేస్తున్న పశువులు, వ్యాన్‌ను తిరుమలాయపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆవు దూడలను ట్రాలీ ఆటోలో తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం అర్ధరాత్రి పాతర్లపాడు సమీపాన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వ్యాన్ డ్రైవర్ నరేష్, వ్యాపారులు మాదాసు వెంకన్న, బత్తుల నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.జగదీష్ తెలిపారు. కాగా, స్వాధీనం చేసుకున్న ఆవుదూడలను గురువారం గొల్లగూడెంలోని గోశాలకు తరలించామని వెల్లడించారు.

విద్యుత్ ఫిర్యాదులకు 'చాట్‌బాట్'

- వాట్సాప్ నంబర్ 79016 28348కు ఫిర్యాదు చేస్తే సరి
- స్థితిగతులు తెలుసుకునేలా ట్రాకింగ్



టీజీ ఎన్పీడీసీఎల్ రూపొందించిన వాట్సాప్ చాట్‌బాట్ విధానం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారంలో మరింత వేగం పెంచడమే కాక వినియోగదారులకు మెరుగైన సేవలందించే లా ఎన్పీడీసీఎల్ (నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) సాంకేతికతను వినియోగించుకుంటోంది. ఇందులో భాగంగానే సమస్యలపై అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా 'వాట్సాప్ చాట్‌బాట్'సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం వాట్సాప్ నంబర్‌ను కేటాయించింది.


ఐడీ నంబర్.. ట్రాకింగ్

వినియోగదారులు చాట్‌బాట్‌లో చేసే ప్రతీ ఫిర్యాదుకు సంస్థ ఒక నంబర్ కేటాయిస్తుంది. అలాగే, సంబంధిత అధికారి వద్దకు ఫిర్యాదు చేరిందని సమాచారం కూడా అందుతుంది. ఆపై వినియోగదారులు ఆ నంబర్ ఆధారంగా సమస్య పరిష్కారం ఏస్థాయిలో ఉందో చాట్‌బాట్‌లో తెలుసుకోవచ్చు. అలాగే, సమస్య పరిష్కరించాక వినియోగదారునికి సమాచారం ఇవ్వడమే కాక ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ చేసి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. ఒకవేళ వినియోగదారులు సంతృప్తి చెందకపోతే మరోమారు కంప్లెయింట్ రీ ఓపెన్ చేసుకోవచ్చు. అలాగే www. tgnpdcl. com వెబ్‌సైట్‌లో కనిపించే వాట్సాప్ ఐకాన్‌పై క్లిక్ చేసి చాట్ చేయొచ్చు.

ఫిర్యాదు నమోదు ఇలా..

వినియోగదారులు తమ సెల్‌ఫోన్ నుంచి వా ట్సాప్ లో 79016 28348 నంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే టీజీఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వా గతం అని వస్తుంది. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్ చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. ఈ మేరకు రిజిస్టర్ కంప్లైంట్ ఎంచుకుంటే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, విత్‌అవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ అని వస్తుంది. ఆపై విత్ యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేస్తే వినియోగదారుడి సర్వీస్ వివరాలు వస్తాయి. ఆ వివరాలను సరిపోల్చుకున్నాక ఓకే చేస్తే సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. ఇలా ఏజెంట్‌తో చాట్ చేస్తూ ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు.

మరింత మెరుగైన సేవలకు..



వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించేలా సాంకేతికతను వినియోగించుకుంటున్నాం. ఇందులో భాగంగా మొబైల్ వాట్సాప్ నుంచి సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. ఇదేకాక టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా సేవలు పొందే అవకాశం ఉంది.

-ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్‌ఈ, ఖమ్మం సర్కిల్

బొగ్గు టిప్పర్ దగ్ధం



దగ్ధమవుతున్న టిప్పర్ కేబిన్

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : మండలంలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీ శాంతినగర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం బొగ్గు టిప్పర్ కేబిన్‌లో మంటలు చెలరేగి దగ్ధమైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి సింగరేణి ఓపెన్‌కాస్టు నుంచి బొగ్గు లోడ్‌తో వచ్చిన టిప్పర్ కొత్తగూడెంలో అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తోంది. ఈ క్రమంలో టిప్పర్ కేబిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ వాహనం నిలిపి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సత్తుపల్లి నుంచి ఫైరింజ‌న్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.


కస్తూరి జింక అవశేషాల ఘటనపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: కస్తూరి జింక అవశేషాల ఘటనలో ఇద్దరిపై గురువారం అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. అశ్వారావుపేట ఫారెస్టు రేంజర్ మురళి కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన ఎస్‌కే అబ్దుల్ హఫీజ్ ఇంట్లో ఉన్న బ్యాగుల్లో కస్తూరి జింకలకు సంబంధించి బంతి ఆకారంలో ఉన్న 13 అవశేషాలు ఉన్నట్లు అనుమానంతో అతని భార్య ఆనీస్ ఫాతిమా ఈ నెల 26న ఫిర్యాదు చేయగా, అధికారులు ఇంట్లో సోదాలు చేసి స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కాగా, ఈ ఘటనలో అబ్దుల్ హఫీజ్‌తోపాటు మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన పామర్తి మధుపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కస్తూరి జింక అవశేషాలుగా భావిస్తున్న వాటిని హైదరాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్‌కు పంపించామని, నిర్ధారణ కావాల్సి ఉందని రేంజర్ తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: వృద్ధుడి ఆత్మహత్య ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని రమణక్కపేట గ్రామానికి చెందిన జల్లి నర్సయ్య(55) కుమార్తె భద్రమ్మకు ఐదేళ్ల క్రితం వివాహం కాగా, ఈ నెల 27న విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. విందులో నర్సయ్య అతిగా మద్యం తాగి వాగ్వాదం పెట్టుకోవడంతో కుల పెద్దలు మద్యం తాగొద్దని మందలించారు. దీంతో మనస్తాపం చెంది అదే రోజు ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



హరీశ్(ఫైల్)

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో గురువారం పని ప్రదేశం నుంచి జారి కింద పడి ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతిచెందాడు. తోటి కార్మికుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం పెద్దకమలాపురం గ్రామానికి చెందిన పర్శిక హరీశ్(24) ఐటీసీ పీఎస్‌పీడీలో ప్రాజెక్ట్ వర్క్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం సుమారు 20 అడుగుల ఎత్తులో పనిచేస్తుండగా, జారి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఐటీసీ డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు చిట్టిబాబు, నర్సమ్మ, కుటుంబసభ్యులు గుండెలావిసేలా రోదిస్తున్నారు. కాగా మృతుడు అవివాహితుడు. మృతుడి కుటుంబానికి ఐటీసీ ఒప్పందం ప్రకారం రావాల్సిన అన్ని బెనిఫిట్స్ అందించేందుకు కృషి చేస్తామని గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.